నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 16 అక్టోబర్ 2024 | KAMAREDDY



టీచర్లుగా ఉద్యోగాలు సాధించిన పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న సీపీ కల్మేశ్వర్

# డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

## ఆర్డర్ కాపీలను అందజేసిన డీఈవో

ఖలీల్‌వాడి, అక్టోబర్ 15 : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో ఎస్జీటీలకు, సమగ్ర శిశు అభియాన్ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్ల( అన్ని సబ్జెక్టులు)కు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉపాధ్యాయ పోస్టింగ్ కౌన్సెలింగ్‌ను వాయిదావేస్తున్నట్లు ఉదయం విద్యాశాఖ ప్రకటన వెలువరించి, మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మళ్లీ ప్రకటించింది. దీంతో డీఎస్సీ అభ్యర్థులు ఒకింత విద్యాశాఖ తీరుపై అసహనం వ్యక్తంచేశారు. కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులకు డీఈవో దుర్గాప్రసాద్ ఆర్డర్ కాపీలను అందజేశారు.

**టీచర్లుగా ఎంపికైన పోలీస్ సిబ్బందికి సీపీ అభినందన..**


వినాయక్‌నగర్, అక్టోబర్ 15: నిజామాబాద్ పోలీస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కొంతమంది సిబ్బంది డీఎస్సీలో అర్హత సాధించారు. ఎస్జీటీ, పీఈటీ, స్కూల్ అసిస్టెంట్లుగా ఏడుగురు ఎంపిక కావడంతో వారిని సీపీ కల్మేశ్వర్ మంగళవారం అభినందించారు. కార్యక్రమంలోఅదనపు డీసీపీలు కోటేశ్వరరావు, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# టాస్క్ 'ఫోర్స్'పై కొరడా

## ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన కమిషనర్

- టాస్క్‌ఫోర్స్‌లో అక్రమాలపై సీపీ నజర్
- 'నమస్తే తెలంగాణ' కథనంతో చర్యలు షురూ
- ప్రత్యేక విభాగంలో భారీగా బదిలీలు
- తాజాగా ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు..





నిజామాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రక్షాళన మొదలైంది. టాస్క్‌ఫోర్స్ విభాగంలో జరుగుతున్న అక్రమాలను ఎత్తిచూపుతూ ఇటీవల 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం పోలీసు శాఖను కదిలించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక విభాగంలో భారీగా బదిలీలు చోటు చేసుకుంటున్నాయి. కొంత మంది ఖాకీల తీరుతో పోలీస్ శాఖ పరువు దిగజారుతున్న తరుణంలో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. 97 మందికి స్థానచలనం కల్పించారు. మరో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఏ చిన్న తప్పు జరిగినా సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ ఏమాత్రం ఉపేక్షించడం లేదు. ఈ క్రమంలోనే టాస్క్‌ఫోర్స్‌లో జరుగుతున్న అవినీతిని నిర్మూలించేందుకు నడుం బిగించారు. రాజకీయ నాయకుల అండదండలతో ఏండ్లుగా ఒకే చోట పాతుకుపోయిన వారిని బదిలీ చేశారు. పైరవీలు అనే మాటెత్తకుండా చెప్పిన చోట పని చేసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు. నాయకుల పేరుతో లెటర్లు తీసుకెళ్తే మొదటికే మోసం వస్తుందన్న భయంతో కానిస్టేబుళ్లు వెనకడుగు వేస్తున్నారు.

**లోతుగా దర్యాప్తు..**

టాస్క్‌ఫోర్స్ విభాగంలో అవినీతి, అక్రమాల వ్యవహారాలపై 'నమస్తే తెలంగాణ' ఇటీవల ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో ప్రత్యేక విభాగంలో అసలేం జరుగుతున్న దానిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఏడాది కాలంలో కళంకిత అధికారి నేతృత్వంలో రెండు వందలకు పైగా కేసులు నమోదయ్యాయి. ఇందులో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి బదులుగా, తమ జేబులు నింపుకొనేందుకు ప్రత్యేక విభాగానికి ఉన్న అధికారాన్ని వాడుకున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారుల కళ్లు గప్పి పాత ఏసీపీ చేసిన ఈ భారీ కార్యకలాపాలకు వంత పాడిన వారిపై చర్యలు తీసుకునేందుకు సీపీ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే తొలి దశలో బదిలీ చేయడం, రెండో దశలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని ప్రచారం జరుగుతున్నది.

**సగం ఖాళీ..**

టాస్క్‌ఫోర్స్ విభాగంలో తాజాగా మరో ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం, పలు ఆరోపణల నేపథ్యంలో ఇద్దరిని సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్‌లో ప్రక్షాళన ప్రారంభించిన సీపీ.. బదిలీ అస్త్రాన్ని ఎంచుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన బదిలీల్లో 73 మంది కానిస్టేబుళ్లు, 12 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు ఏఎస్సైలు ఉండగా, మంగళవారం మరో ఆరుగురు కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగించారు. దీంతో ఇప్పటి వరకు 97 మందిని బదిలీ చేశారు. నలుగురు కానిస్టేబుళ్లు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లను ఈ విభాగం నుంచి తొలగించి వివిధ ఠాణాలకు అటాచ్ చేశారు. బదిలీలు, సస్పెన్షన్లలతో టాస్క్‌ఫోర్స్ విభాగం ప్రస్తుతం సగం ఖాళీగానే మారింది. కొత్తగా ఈ విభాగానికి వేరే వారిని నియమించలేదు. ఎలాంటి ఆరోపణలు లేని ఖాకీలకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ఉన్నతాధికారులు జాబితా రూపొందిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే, తాజాగా ఇద్దరిని సస్పెండ్ చేయడంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పని చేసిన కళంకిత అధికారితో అంటకాగిన వారిలో భయం పట్టుకుంది.



హలో..

**ప్రైవేట్ వ్యాపారులు ఎలా తీసుకుంటారు?**

మా సోయా ధాన్యంలో చెత్త ఉందని అధికారుల వాపస్ పంపించారు. మరీ ప్రైవేట్ వ్యాపారులు ఎలా తీసుకుంటారో అధికారులు సమాధానం చెప్పాలి. గతంలో ఎన్నడూ కూడా కొనుగోలు కేంద్రం నుంచి మేము విక్రయించిన ధాన్యం వాపస్ రాలేదు. పేరుకే కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇలా రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరి కాదు.

**- భూపాల్, రైతు, మోతె గ్రామం, వేల్పూర్ మండలం**

# మీ సోయాలు తీసుకెళ్లండి..

- కొనుగోలు కేంద్రం నుంచి రైతులకు ఫోన్లు
- విక్రయించిన సోయాను వాపస్ ఇచ్చిన నిర్వాహకులు
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

వేల్పూర్, అక్టోబర్ 15 : 'హలో..పదిహేను రోజుల క్రితం కొనుగోలు కేంద్రంలో మీరు విక్రయించిన సోయా బాగోలేదట.. అవి పై నుంచి వాపస్ వచ్చినయ్.. వెంటనే కేంద్రానికి వచ్చి తీసుకెళ్లండి..' అంటూ నిర్వాహకుల నుంచి ఫోన్లు రావడంతో రైతులు కంగుతిన్నారు. కొనుగోలు కేంద్రానికి వెళ్లగా నిర్వాహకులు సోయా బస్తాలను తిరిగి ఇచ్చేయడంపై అన్నదాతలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. వేల్పూర్ మార్కెట్ యార్డులో ప్రభుత్వం 15 రోజుల క్రితం సోయా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, సేకరణ ప్రారంభించింది. దీంతో రైతులు తమకు మద్దతు ధర వస్తుందని సంతోష పడ్డారు. మండలంలోని మోతె గ్రామానికి చెందిన కొందరు రైతులు సోయాలను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి విక్రయించారు. చెన్ని పట్టించి కాంటా కూడా చేశారు. రెండురోజుల క్రితం రైతులకు కొనుగోలు కేంద్రం నుంచి ఫోన్ వచ్చింది. 'మీరు విక్రయించిన సోయా 60 బస్తాలు రిటర్న్ వచ్చాయి. అవి బాగోలేవట..వచ్చి తీసుకెళ్లండి..' అంటూ కేంద్రం నిర్వాహకులు చెప్పడంతో రైతులు అవాక్కయ్యారు. మంగళవారం కేంద్రానికి వెళ్లిన సదరు రైతులకు 60 బస్తాల సోయాను వాపస్ ఇవ్వగా.. చేసేదిలేక వారు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సి వచ్చింది.

**కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి..**



బీర్కూర్‌లో ఆరబెట్టిన ధాన్యం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

## ధాన్యం కుప్పల వద్ద రైతుల నిరసన

నస్రుల్లాబాద్, అక్టోబర్ 15: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీర్కూర్‌లో రైతులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పది రోజుల నుంచి వరి కోతలు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. ధాన్యం ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిరోజూ తాము ధాన్యం కుప్పల వద్దే కాపలా ఉండాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# బోధన్ శివారులో భారీ చోరీ

- వడ్ల వ్యాపారి ఇంట్లో నుంచి రూ. 50 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు అపహరణ
- మరో మూడు ఇండ్లలో దొంగతనానికి యత్నించిన దుండగులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 15: బోధన్ పట్టణ శివారులోని ఆచన్‌పల్లి శ్రీనివాసనగర్ ప్రాంతం లో ఈ నెల 14 అర్ధరాత్రి తర్వాత తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండుగులు భారీ చోరీకి పాల్పడారు. రూ. 50 లక్షల నగదుతోపాటు 20 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లి, మరో మూడు ఇండ్లలో చోరీకి యత్నించారు. శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన శాఖమూరి వెంకటేశ్వర్‌రావు అనే వడ్ల వ్యాపారి సొంత పని నిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం తెల్లవారు జామున తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు తెరిచి ఉండడం, లోపల సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండడం గమనించాడు. తన వ్యాపారం కోసం రైతులకు చెల్లించేందుకు చేబదులుగా తెచ్చుకున్న రూ.50లక్షలతో పాటు ఇంట్లోని సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని దుండుగులు పక్కనే మరో మూడు ఇండ్లలో చోరీకి యత్నించారు.

ఓ కుటుంబం నిద్రిస్తున్న గదికి బయటి నుంచి గడియ పెట్టి ఇంట్లో నుంచి రూ.50 వేలు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో రెండు ఇండ్లలో చోరీకి యత్నించగా ఏమీ దొరక్కపోవడంతో వెనుదిరిగారు.బాధితుల ఫిర్యాదు మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణ ఘటనా స్థలాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ

# రెండోరోజూ కొనసాగిన డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

- టీయూ రిజిస్ట్రార్‌తో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల భేటీ
- తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి
- బోధన్‌లో నిర్వహించ తలపెట్టిన ధర్నా వాయిదా



టీయూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కో-ఆర్డినేటర్ నరాల సుధాకర్ తదితరులు

**బోధన్‌లో ధర్నా వాయిదా**

బోధన్ పట్టణంలోని పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మంగళవారం బంద్ పాటించాయి. బంద్‌లో భాగంగా ఆయా కళాశాలల కరస్పాండెంట్లు నిర్వహించ తలపెట్టిన ధర్నాను పోలీసులు అనుమతించకపోవడంతో వాయిదా వేశారు. తమ సంఘం పిలుపుమేరకు ఆందోళనలు, నిరసనలు చేపడతామని బోధన్ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కరెస్పాండెంట్లు తెలిపారు.

బోధన్/ ఖలీల్‌వాడి/ డిచ్‌పల్లి, అక్టోబర్ 15: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ల ఆధ్వర్యంలో చేపట్టిన కళాశాలల బంద్ రెండోరోజూ కొనసాగింది. ఇందులోభాగంగా ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కో-ఆర్డినేటర్ నరాల సుధాకర్ మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, ఆడిట్‌సెట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌తో భేటీ అయ్యారు. కళాశాలల నిరవధిక బంద్‌కు గల కారణాలను ఆయనకు వివరించారు. విద్యార్థులకు మూడేండ్ల నుంచి ఉపకార వేతనాలు రావడంలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులకు కొన్ని నెలల నుంచి జీతభత్యాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వారి వెంట నిశిత రాజు, సూర్యప్రకాశ్, సుజన్, అరుణ్‌కుమార్, రాజు, శ్రీనివాస్, అతిక్ ఉన్నారు.



బోధన్‌లో మూసిఉన్న డిగ్రీ కళాశాల

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం

## ఆందోళనలో రైతాంగం

బాన్సువాడ, అక్టోబర్ 15 : వాతావరణంలో మార్పుల కారణంగా కొన్నిరోజులుగా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం బాన్సువాడ పట్టణంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. పదిరోజుల క్రితం నుంచి కోతలు చేపట్టిన రైతులకు ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తోంది. వచ్చిన ధాన్యాన్ని బాన్సువాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఆరబోయగా.. కురుస్తున్న వర్షాలకు ధాన్యం కుప్పల కిందికి నీరు చేరుతోంది. దీంతో వర్షపు నీటితో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మొన్నటి వరకు వర్షాలతో ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు కోతల సమయంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు.



బాన్సువాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఆరబోసిన ధాన్యం కిందికి చేరిన వర్షపు నీరు